క్లుప్తంగా

జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ



టీచర్లకు సూచనలు ఇస్తున్న ఎంఈవో

నింద్ర: మండలంలోని అత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఎంఈవో శ్రీధర్‌రాజు తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సామర్థ్యాలను గుర్తించారు. పదో తరగతి పాఠ్యాంశాలను బోధనపై ఆరా తీశారు. పరీక్షలు చక్కగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ప్రమాదకరంగా కల్వర్టు



విజయపురం: మండలంలోని నగరి–కనకమ్మ సత్రం రోడ్డులోవున్న మహావీరపురం వద్దనున్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన వర్షానికి కల్వర్టు కోతకు గురైంది. ఈ రోడ్డు గుండా నిత్యమూ వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనదారులు ఏ మాత్రం ఆదమరిచినా ప్రమాదాల బారిన పడాల్సిందే. ఇటీవల ఒక ద్విచక్రవాహనదారుడు, ఒక సైక్లిలిస్ట్ రాత్రి గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

పశువులకు వైద్య చికిత్సలు



పశువులకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారులు

నింద్ర: మండలంలోని కేఆర్ పాళెంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశుసంవర్ధకశాఖ ఏడీ మునిలక్ష్మీపతి పశువులకు చికిత్స చేశారు. ఆయన మట్లాడుతూ పశువులకు వచ్చే రోగాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఏదైనా జబ్బును గుర్తించిన వెంటనే సమీపంలోని వైద్యుడిని సంప్రదించి వైద్య చికిత్స చేయాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ వైద్యాధికారి ప్రభాకర్ వర్మ, సిబ్బంది ధనవేల్, జయంతి తదితరులు పాల్గొన్నారు.


ఉచిత కంటి వైద్య శిబిరం



వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం బట్టి కండ్రిగ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షతన వాసన్ ఐ కేర్ ఆసుపత్రి వైద్యులు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మందికి కంటి పరీక్షలు చేశారు. ఇందులో 18 మందికి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వారికి ఉచితంగా ఆపరేషన్ చేస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండర్ కోనేటి రవిరాజు, అధ్యక్షుడు బాబు, కార్యదర్శి రామ్మోహన్ వర్మ, రామచంద్ర రాజు, కె.సుబ్రమణ్యం రాజు, కె.పద్మనాభరాజు తదితరులు పాల్గొన్నారు.

అరకొరగా మామిడి పూత





గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో భారీ వర్షాలు కురిశాయి. ప్రస్తుతం మంచు ఎక్కువగా కురుస్తోంది. దీంతో మామిడిలో పూత సక్రమంగా రాలేదు. చెట్టులో వచ్చిన కొంత పూత సైతం మగ్గిపోయి రాలిపోతోంది. ఇలా అయితే ఈ ఏడాది మామిడి దిగుబడి తగ్గిపోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా ఏదో ఒక ఉపద్రంతో నష్టపోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

- కురిసిన వర్షాలకు మగ్గిపోయిన పూత
- మంచుకు రాలిపోతున్న వైనం
- ఈ సారి దిగుబడి కష్టమేనంటున్న రైతులు
- మందుల పిచికారీతో తడిసి మోపెడుతువున్న ఖర్చులు

పుత్తూరు: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 2.65 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. పుత్తూరు వ్యవసాయ డివిజన్ పరిధిలో పుత్తూరు, వడమాలపేట, రామచంద్రాపురం, నారాయణవనం మండలాలు ఉండగా 18 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. సాధారణంగా మంచి దిగుబడి వస్తే డివిజన్ మొత్తం మీద 45 నుంచి 50 వేల టన్నుల దిగుబడి వస్తుంది. ఈఏడు పరిస్థితులను చూస్తుంటే సగానికి సగం దిగుబడి కూడా కష్టమేనని రైతులు చెబుతున్నారు. సాధారణంగా ప్రతి ఏటా డిసెంబర్‌లో మామిడి పూత ప్రారంభమవుతుంది. జనవరి నెలాఖరుకు దాదాపు 70 శాతం పూతతో చెట్లు కళకళలాడతాయి. ఈ ఏడాది ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 20 శాతానికి మించి పూత రాలేదు. దీనికితోడు అడపాదడపా కురిసిన వర్షాలకు వచ్చిన పూత మగ్గిపోయి రాలిపోయింది. మంచు ఎక్కువగా కురుస్తుండడంతో తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ముఖ్యంగా అంత్రక్నోస్ తెగులు ఆశించి పూత మగ్గి రాలిపోతోంది. దీంతో దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. అప్పు చేసి పంటలకు మందులు పిచికారీ చేస్తున్నా ఫలితం ఉండడం లేదని వాపోతున్నారు. ఉద్యాన వన శాఖ అధికారులు మామిడి తోపులను పరిశీలించి పూత రాలిపోకుండా ఉండి మొగ్గతొడిగేందుకు మూడు విడతలుగా మందు పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. ముందుగా పూత మొగ్గ తొడగడానికి 13:0:45(మల్టీ–కె) 10 గ్రాములు, ఫార్ములా 4–2 గ్రాములు, క్లోరోపైరిపాస్ 50 శాతం, ఈసీ–2 మిల్లీలీటర్లను కలిపి చెట్టు అంతా మంచులా పడేలా పిచికారి చేయాలని చెబుతున్నారు. రెండోసారి మొగ్గతొడిగిన తర్వాత బఫ్రోఫెజిన్ 20 శాతం, ఎసిపేట్ 50 శాతం కాంబినేషన్‌లో ఉండే



మామిడి పంటను పరిశీలిస్తున్న అధికారి

మందు 1 గ్రాము, మాంకోజేబ్ 63 శాతం, కార్బెండజిం 12 శాతం కాంబినేషన్‌లో ఉండే మందు 1.5 గ్రాములు, ఫార్ములా 4– 2 గ్రాములు, గమ్ 0.5 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని పేర్కొంటున్నారు. తద్వారా రసం పీల్చే పురుగులు, అంత్రక్నోస్ తెగుల నుంచి పూమొగ్గను కాపాడుకోవచ్చని వెల్లడిస్తున్నారు. ఈ దశలో ఫార్ములా 4 శాతం కలిపి పిచికారీ చేయడం ద్వారా పిందె కట్టే శాతాన్ని పెంచుకోవచ్చని చెబుతున్నారు. మూడోసారి పిందె బఠానీ గింజ పరిమాణంలో ఉన్నప్పుడు డైనోటేఫురాన్ 20 శాతం, ఎస్‌జీ 0.6 గ్రాములు, లేదా స్పైనోసాడ్ 45 శాతం ఎస్‌సీ 0.3 మి.లీ మందు, అజాక్సిస్ట్రోబిన్ 23 శాతం ఎస్‌సీ 1 మి.లీ, లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 50 శాతం డబ్ల్యూపీ 3 గ్రాముల మందు బోరాన్ 1 గ్రాములు, గమ్ 0.5 మి.లీలు కలిపి పిచికారీ చేయాలని తెలుపుతున్నారు. ప్రతి పిచికారీలో గమ్ తప్పనిసరిగా వాడాలని, తద్వారా మందు పనిచేసే సామర్థ్యం పెరుగుతుందని పేర్కొంటున్నారు.



పండు ఈగ బుట్టలు సిద్ధం చేసుకోండి



సస్యరక్షణలో భాగంగా పంట దిగుబడి సమయానికి పండు ఈగ బుట్టలు సిద్ధం చేసుకోవాలి. ఎకరాకు 10 నుంచి 12 బుట్టలు సరిపోతాయి. ఈ పండు ఈగలు కాయలకు రంధ్రం చేసి లోపలి గుజ్జుని తినేస్తాయి. బుట్టలు ఏర్పాటు చేయడంతో అందులో నుంచి వచ్చే వాసనకు ఈగలు బుట్టలో పడిపోతాయి. తద్వారా పంటను సంరక్షించుకోవచ్చు. అలాగే కాయలకు కవర్లు కట్టడం వల్ల నాణ్యమైన దిగుబడి పొందేందుకు అవకాశం ఉంటుంది. బుట్టలు, కవర్లను సబ్సిడీ కింద పొందేందుకు రైతు సేవా కేంద్రాల్లో దరకాస్తు చేస్తుకోవాలి.

– జి.వెంకటసౌజన్య, ఉద్యానవన అధికారి, పుత్తూరు

వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు తగదు



చిట్టిబాబు

విజయపురం: ఎమ్మెల్యే భానుప్రకాష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ యూత్ మండల అధ్యక్షుడు చిట్టిబాబు ఖండించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కరోనా కష్ట కాలంలో ప్రాణాలను సైతం లెక్క చేకుండా పని చేసిన ఘనత వలంటీర్లకు దక్కుతుందన్నారు. తాము అధికారంలోకి వస్తే నెలకు రూ.10 వేలు ఇస్తామని ఎన్నికల్లో నమ్మించి ఇప్పుడు వారిని మోసం చేయడం దారుణమన్నారు. వలంటీర్లకు ఎమ్మెల్యే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎంఈఓ రాజేంద్రప్రసాద్

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంఈఓ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం రామలింగాపురం, వనదుర్గాపురం ప్రాథమి కోన్నత పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా చేయించాల్సిన బాధ్యత పాఠశాల హెచ్‌ఎంపై ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోదండయ్య, ఉపాధ్యాయుడు ప్రకాష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నగరి అధ్యక్షులు వీరే

నగరి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరి నియోజకవర్గ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా జి.యువరాజు, మహిళా విభాగం సి.అముద, రైతు విభాగం కె.తోయజాక్షరెడ్డి, బీసీ సెల్ ఇ.చంద్రబాబు, ఎస్సీ సెల్ ఎం.ఎస్.లక్ష్మణమూర్తి, ఎస్టీ సెల్ టి.జయశంకర్, మైనారిటీ సెల్ కెఆర్ సలీం, క్రిస్టియన్ మైనారిటీ సెల్ సిఎస్.రవిబాబు జోహర్ నియమితులయ్యారు. స్టూడెంట్ విభాగం అధ్యక్షుడిగా డి.లోకేష్, పంచాయతీరాజ్ వింగ్ ధనపాల్‌రెడ్డి, మున్సిపల్ వింగ్ ఎస్ఎస్ మోహన్‌రాజు, ఆర్‌టీఐ వింగ్ టి.మదన్‌మోహన్‌రెడ్డి, వలంటీర్స్ వింగ్ సిఎస్ దిలీప్‌కుమార్, గ్రీవెన్స్ సెల్ డి.బుజ్జిరెడ్డి, వాణిజ్య విభాగం ఎం.కిషోర్‌కుమార్‌ను నియమించారు. అలాగే వీవర్స్ వింగ్ అధ్యక్షుడిగా ఎంఎస్ తిరునావక్కర్స్, వైఎస్ఆర్‌టీయూ టి.రాజారెడ్డి, అంగన్‌వాడీ వింగ్ ఆర్.లీలావతి, లీగల్ సెల్ ఇ.జి.బాబు, కల్చర్ వింగ్ సి.వెంకటముని, సోషల్ మీడియా వింగ్ జి.అంకయ్య(చిట్టిబాబు), ఐటీ వింగ్ ఎస్.మురళీరెడ్డి, దివ్యాంగుల విభాగం కె.శ్రీనివాసులురెడ్డి, డాక్టర్స్ వింగ్ ఇ.సిద్ధయ్య డేవిడ్(ప్రభుదాస్), పబ్లిసిటీ వింగ్ పి.గోపిరాయల్, బూత్ కమిటీస్ ఎం.సురేష్‌కుమార్‌రాజు నియమితులయ్యారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు.

గంగాధర్ నెల్లూరు నియోజకవర్గంలో..

కార్వేటినగరం: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో పలువురికి పదవులు ఇస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ప్రకటించింది. యూత్‌వింగ్ అధ్యక్షుడిగా కే.కిషోర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఎస్.రాధిక, రైతు విభాగానికి కే.బాబురెడ్డి, బీసీసెల్‌కు ఎ.ధనుంజయరెడ్డి, ఎస్సీ సెల్‌కు టి.వెంకటరత్నం, ఎస్టీ సెల్‌కు టి.వెంకటేశ్వర్లు, మైనారిటీ సెల్‌కు ఎం.కే ఇమ్రాన్, క్రిష్టియన్ మైనారిటీ సెల్‌కు టీఎం ఎబినేజర్ పాల్, విద్యార్థి విభాగానికి ఎ.పవన్‌కుమార్ నియమితులయ్యారు. అలాగే పంచాయతీ వింగ్ అధ్యక్షుడిగా పీ.రాజశేఖర్‌రెడ్డి, ఆర్‌టీఐ విభాగం అధ్యక్షుడిగా వి.సుందర్‌రాజు, వలంటీర్ల విభాగానికి వి.అశోక్‌రెడ్డి, గ్రీవెన్స్‌సెల్ విభాగానికి ఎం.సతీష్, వాణిజ్య విభాగానికి ఎ.బాలాజీ, వీవర్స్ వింగ్‌కు ఎస్.పండరినాథ్‌ను నియమించారు. వైఎస్సార్ టీయూసీ విభాగం అధ్యక్షుడిగా ఎస్.సుబ్రమణ్యంరెడ్డి, అంగన్‌వాడీ విభాగం అధ్యక్షురాలిగా కే.మీన, లీగల్ సెల్ విభాగానికి ఎస్.హరిబాబు, కల్చరల్ విభాగానికి టీ.నాగమణి, సోషల్ మీడియా వింగ్‌కు కే.బ్రహ్మతేజ, ఐటీ విభాగం ఎం.రుషికేష్, దివ్యాంగుల విభాగం కే.రమేష్, డాక్టర్స్ విభాగం డాక్టర్ పీ.దేవరాజులు, పబ్లిసిటీ విభాగం ఎ.భీమశంకర్‌రెడ్డి, ఇంటెలెక్చువల్స్ ఫోరం అధ్యక్షుడిగా ఎం.ధామోదరనాయుడు, బూత్‌కమిటీకి బీ.నారాయణరెడ్డిని నియమించారు.

చీడపీడల నివారణకు నానో యూరియా



అవగాహన కల్పిస్తున్న ఏవో హేమలత

కార్వేటినగరం: పంట సాగులో చీడ, పీడల నివారణకు నానో లిక్విడ్ యూరియా ఎంతో సమర్థవంతంగా పని చేస్తుందని మండల వ్యవసాయాధికారిణి హేమలత పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని డీఎం పురం, కేఎం పురం పంచాయతీల్లో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో భాగంగా రైతులకు నానో లిక్విడ్ యూరియా వినియోగంతో కలిగే లాభాలను వివరించారు. నానో యూరియా వినియోగంతో పంట ఉత్పత్తి పెరుగుదల, నాణ్యత పెరుగుతుందని వివరించారు.


విద్యాభివృద్ధిలో తల్లిదండ్రుల పాత్ర కీలకం



సూచనలిస్తున్న ప్రిన్సిపాల్ అన్నపూర్ణశారద

వెదురుకుప్పం: విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు తమతో పాటు తల్లిదండ్రుల పాత్ర కీలకమని ప్రిన్సిపాల్ అన్నపూర్ణశారద పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తును బంగారుమయం చేసేందుకు అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పేరెంట్స్ , టీచర్స్ కమిటీ కోఆర్డినేటర్ ప్రభాకరరావు మాట్లాడుతూ.. విద్యార్థులు సక్రమమైన మార్గంలో పయనించేందుకు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ వెంకటేశు, అధ్యాపకులు మంగళగౌరి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరామర్శ



ప్రశాంతికి నివాళులర్పిస్తున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి దళితవాడకు చెందిన ఉషారాణి అలియాస్ ప్రశాంతి(28) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందింది. సమాచారం అందుకున్న వైఎస్సార్‌సీపీ జీడీ నెల్లూరు సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి గ్రామానికి వెళ్లి ఉషారాణి మృతదేహానికి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. చిన్న వయస్సులో అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమన్నారు. వారి వెంట ఎంపీటీసీ మురగయ్య, మాజీ సర్పంచ్ అంకయ్య, నాయకులు సురేష్, అజిత్ ఉన్నారు.

ప్రజలను మరోసారి మోసం చేసిన చంద్రబాబు



మాట్లాడుతున్న కృపాలక్ష్మి

పాలసముద్రం: ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారని వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆరోపించారు. ఆమె బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పథకాలు అమలుచేస్తామని ఊదరగొట్టారని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చి పథకాలు అమలు చేయలేకున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో హామీలు ఇచ్చేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌కు తెలియదా అని ప్రశించారు. రాష్ట్రం రూ.14 లక్షల కోట్ల అప్పుల్లో ఉందని తప్పుడు ప్రచారం చేశారని, అసెంబ్లీలో ఆరు లక్షల కోట్లే అని ప్రకటించారని గుర్తు చేశారు. నిరుద్యోగులకు 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తామని, లేకుంటే నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి పంగనామం పెట్టారని దుయ్యబట్టారు. అధికారంలోని వచ్చిన వెంటనే జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇచ్చి అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని నిలువునా మోసం చేశారని విమర్శించారు. పింఛను మొత్తం పెంచామని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు 30 శాతం పింఛన్లు తొలగించి వృద్ధులు, దివ్యాంగుల కడుపు కొట్టారని పేర్కొన్నారు. 60 శాతం మందికి ఉచిత గ్యాస్ నగదు పడలేదని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం ఊసేలేదని తెలిపారు. ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన దమ్మున్న నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని గుర్తు చేశారు.

ప్రసవంలోనే శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆందోళన



ఆరోగ్య సిబ్బంది తీసుకెళుతున్న చిన్నారి

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆరోగ్య సిబ్బంది ప్రసవం నిర్లక్ష్యంగా చేయడంతో శిశువు మృతి చెందిందని శిశువు తండ్రి దినేష్ ఆందోళన వ్యక్తం చేశాడు. నరసింహపురం గ్రామానికి చెందిన దినేష్ భార్య ప్రతిభ తొలి ప్రసవం కోసం మంగళవారం పాలసముద్రం పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి ప్రసవ నొప్పులతో ఆమె ఇబ్బందులు పడుతోంది. ఆమెకు తోడు ఆశా కూడా లేదు, పలు ఇబ్బందులు పడి ఉదయం 11 గంటలకు మగ శిశువు జన్మించిందని తండ్రి దినేష్‌కు చెప్పారు. అయితే గంట తరువాత నింపాదిగా శిశువుకు చలనం లేదని కానీ పల్స్ కొట్టుకుంటోందని దినేష్‌కు చెప్పి 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు ప్రసవ సమయంలోనే శిశువు మృతి చెందిందని చెప్పారు. దీంతో తండ్రి దినేష్ లబోదిబోమని వాపోయాడు. శిశువు మృతికి పాలసముద్రం ఆరోగ్య కేంద్రం సిబ్బందే కారణమని ఆరోపించారు. నా భార్యకు ప్రసవం ఇక్కడ కాదని చెప్పి ఉంటే అప్పు చేసైనా ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి శిశువుని కాపాడుకొనేవాడినని ఆవేదన చెందాడు.

ఫిర్యాదుదారులతో స్నేహ పూర్వకంగా మెలగాలి



మాట్లాడుతున్న డీఎస్పీ ఎస్.ఎండీ అజీజ్

కార్వేటినగరం: సమస్యలపై పోలీసు స్టేషన్‌కు వచ్చే వారితో స్నేహ పూర్వకంగా మెలగాలని నగరి డీఎస్పీ ఎస్.ఎండీ అజీజ్ ఆదేశించారు. ఆయన బుధవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. విలేకరులతో మాట్లాడారు. కార్వేటినగరం సర్కిల్ పరిధిలోని పాలసముద్రం, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం మండలాలు తమిళనాడు సరిహద్దులో ఉండడం వల్ల అక్రమ వ్యాపారాలు జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై ప్రత్యేక నిఘా పెడతామన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సరిహద్దు ప్రాంతాల్లో గంజాయి, ఖైనీ, గుట్కా, సారా తదితర అక్రమ వ్యాపారాలకు తావులేకుండా నిఘా పెంచనున్నట్లు వివరించారు. సమస్యాత్మక గ్రామాల్లో రాత్రిళ్లు గస్తీ పెంచాలని సిబ్బందిని ఆదేశించినట్లు తెలిపారు. ప్రధాన రహదారుల్లో చైన్ స్నాచింగ్‌లు చోటు చేసుకోకుండా పికెట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆయన వెంట సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ ఉన్నారు.

రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

కూటమి నేతల కనుసన్నల్లో ఇసుక మాఫియా పేట్రేగిపోతోంది. అధికారంలోకి రాగానే కేవీ పురం కుశస్థలి నదిని కొల్లగొట్టేస్తున్నారు. సీసీ రోడ్డును అడ్డుపెట్టుకుని యథేచ్ఛగా దోపిడికి పాల్పడుతున్నారు. కేవీ శ్రీరామపురం నుంచి ఇసుకను తరలించి ఊరు శివారు ప్రాంతాల్లో డంప్ చేసి, అక్కడ నుంచి తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తూ లక్షలు గడిస్తున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినా మామూళ్ల మత్తులో జోగుతున్నారని మండల ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.

- కేవీపురంలో కుశస్థలి నదిని కొల్లగొడుతున్న టీడీపీ నేతలు
- సీనియర్ నాయకుడే సూత్రధారి
- సీసీ రోడ్డు ముసుగులో తమిళనాడుకు తరలింపు



కుశస్థలి నదిలో ఇసుక తీస్తున్న ట్రాక్టర్లు



నార్పరాజు కండ్రిగ వద్ద డంప్ చేసిన ఇసుక



పొలంలో ఏర్పాటు చేసిన దారి

విజయపురం: కేవీపురం మండలం కేవీ శ్రీరామపురానికి చెందిన ఓ సీనియర్, జూనియర్ టీడీపీ నాయకులు ఇటీవల ఇసుక మాఫియాగా రాజ్యమేలుతున్నారు. తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో ఇసుకనుడంపింగ్ చేసి దాటిస్తున్నారు. అధికారులు మాత్రం అక్రమార్కులను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. అక్రమ రవాణా చేస్తున్నారని అధికారులు ఒకవేళ ఇసుక ట్రాక్టర్లను పట్టుకుంటే నిమిషాల వ్యవధిలోనే ఫోన్లు వస్తున్నాయి. ఆ ట్రాక్టర్ తమకు సంబంధించిన వ్యక్తిది వదిలేయ్ అని మండల నాయకుల నుంచి హుకుం. ఒకవేళ కుదరని తేల్చి చెబితే.. ఎమ్మెల్యే నుంచి చెప్పించమంటావా..? ఓవరాక్షన్ చేస్తుండడం, మరి కొందరికి మామూళ్లు ఇస్తుండడంతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

తమిళనాడులో రూ. 10వేలు

విజయపురం మండలంలో ట్రక్కు ఇసుక సుమారు రూ. 5వేల వరకు పలుకుతోంది. అదే తమిళనాడుకు తీసుకెళితే రూ.10వేల నుంచి రూ.12 వేలు వరకు పలుకుతుండడంతో రాత్రి సమయంలో యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు. ఎవరైనా దీని గురించి అధికారులకు సమాచారం ఇస్తే, దీర్ఘకాలంగా పాతుకుపోయిన కింది స్థాయి సిబ్బంది కొందరు ఇసుక మాఫియాకు ఉప్పందిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

దారికి రూ. 500 కప్పం

ఇటీవల కురిసిన వర్షానికి కుశస్థలి నదిలో దారి తెగిపోయింది. అయినా ఇసుక మాఫియా ఓ పొలంలో దారి ఏర్పాటు చేసి ఇసుకను తరలిస్తుండటం గమనార్హం! ఆ దారిలో ఒక ట్రాక్టర్ వెళితే రూ. 500 చొప్పున వసూలు చేస్తున్నారు. అది కూడా తమకు నచ్చిన ట్రాక్టర్లు మాత్రమే రావాలంటూ హుకుం జారీ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కబడ్డీ పోటీల్లో రన్నర్‌గా కళాశాల విద్యార్థులు

పాలసముద్రం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కబడ్డీ పోటీల్లో రన్నర్‌గా వచ్చారని బుధవారం కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. జే.జశ్వత్, భరత్ అంకుపాల్యం క్రీడా మైదానంలో జరిగిన చిత్తూరు జిల్లా కబడ్డీ జట్టులో పాల్గొని రన్నర్‌గా వచ్చారని తెలిపారు. కబడ్డీ పోటీల జట్టులో జూనియర్ కళాశాల విద్యార్థులు ఉన్నందున గర్విస్తున్నామని తెలిపారు.



కబడ్డీ పోటీల్లో రన్నర్‌గా వచ్చిన జిల్లా జట్టు